# ఎంపు

కుంటాడి కావేళ జోలి నిండిపోయింది. అది ఆవేళ వాడి అదృష్టం. జోలితో జోలెడు ముష్టి, అంటే రెండు కుంచాల బియ్యం. రేపటి చింతలేని బతుకైనా తొడకి బరువుగా తగుల్తూ, జోలి వేళాడుతూ ఉంటే కుంటాడి ప్రాణం సంతుష్టితో సుఖపడ్డాది. పది రోజుల గ్రాసం బుజాన్ని దిగ లాగుతూ వేళ్లాడుతున్నాది.

కుంటాడు కాలెగరేస్తూ ఊరవతల తోటల్లో కెళ్లాడు. నెల్లాకు, ఎండుపుల్లలు ఏరుకున్నాడు. మూడు మామిడి పింజలు దొంగిలించాడు. సాయంకాలానికి సత్రపు అరుగులు చేరుకున్నాడు. మూటలో మట్టిపిడత తీశాడు. మూడు రాళ్ల మధ్య నిప్పు చేసి అన్నం ఎసరు పెట్టేడు.

ఎర్రగా పొయ్యి నిండా లేచింది మంట. చలితో చుట్టుకుపోయిన కుంటాడి శరీరం వెచ్చపడ్డాది. చుట్ట ముట్టించి అడ్డపొగ పెట్టేడు. వాడి తొడకానుకొని ఉన్న బియ్యపు జోలిని తణువుకుంటూ తనివితో కళ్లు అరమోడ్చేడు. అన్నం ఉడుకట్టింది.

"ఎర్రీ!" అని కేక పెట్టాడు. సత్రపు అవతలవరండాలో ఎర్రీ, దాని కుష్టురోగపు తండ్రి కాపరమున్నారు. ఎర్రి వొచ్చింది.

"పులుసుదాకోపాలి యిద్దూ?" అన్నాడు.

"ఏం పులుసురో?" అన్నాది ఎర్రి.

"ఏం పులుసునే, మామిడికాయ నెల్లాకు!"

ఎర్రి పనికట్టింది. కుంటాడి చంకలోంచి దిగి తొడవార గుండ్రంగా మఠం వేసుకొని ఉన్నాది రెండు కుంచాల బియ్యపు మూట. ఎర్రి బుర్రంతా ఆశతో నిండిపోయింది.

"గింజలు బాగా దొరికినాయిరో! ఎవిడి మొకం సూసినావు?" అన్నాది.

"సీకటితో నలిమంట ఏసినారు. ఎర్రగా నీ మొకమే సూసినాను" అన్నాడు.

"ఉన్ననాడూ తినవా? ఎదవ నెల్లాకు. సేపలైనా కొన్రా! నానైతే మాంసం కొందును."

"అమ్మో గింజలైపోవు? ఆటితో నాను పదేను రోజులు బతకాలి!"

"రేపు తిరిపెమెత్తవా? జానడు పొట్టకేటోరె? మూడు పిడికిళ్లు దొరికితే సాల్దా? కొన్రా సేపలు!" అని బలవంతపెట్టింది.

దాని మాటలో ఉన్నాది ముష్టివాళ్ల ఆర్థిక రహస్యం. మూడు పిడికిళ్లు దొరికితే చావకుండా బతకొచ్చు! నలుగురమ్మలకి దయగలిగితే పొట్ట నిండిపోతుంది. అదీ ముష్టివాళ్ల ధీమా! సొట్టాడు

లేచాడు. ముసిల్దాని కొట్టుకెళ్లాడు. ముసిల్ది ముష్టి ముసాఫర్లకి కిరాణా సామానులు, కూరలు, కంపకట్టలూ అమ్ముతుంది. సోలడు నూకలు వెలపుచ్చుకొని నాలుగెండు చేపల్తో సహా పులుసు సామానిచ్చింది. ఎఱ్రి పులుసుదాక తెచ్చింది.

"ఒరే, నే నోటడుగుతాను" అన్నాది.

"నువ్వడుగుతావని నాకు తెల్సును" అన్నాడు.

"ఏటిరో?"

"బియ్యం!"

"మా యయ్యకి జొరం. మూణ్ణాళ్లయి ముష్టినేదు."

"నా నియ్యను".

"ఓ రియ్యరా!"

"జటకావోణ్ణడుగు. ఆడంటే నీకు రోకు."

"నీ జిమ్మడ! జటకావోడు నన్నొగ్గేసినాడు."

"నేదు. ఆడు బండీ ఎక్కి కుచ్చుల కమిచీతో ఛలో ఛలో అంటాడు. ఆడి దగ్గర కెళ్ళు!"

"ఆడికి పెళ్లయిపోనాది!"

"ఐతే బైరోగోణ్ణడుగు. బైరోగోడిపాటి సేసినాను కాదు! నా నూకలు కావాలా?"

"ఆ బైరాగోడి సంగతి తెలుసా? వో నా దద్దరేతిరి శిలుం కొట్టి కొట్టి ఒచ్చినాడు. 'ఏటంటావు' అన్నాడు. 'రూపాయి ఇయ్యి' అన్నాను. 'రూపాయి బుఱ్రా నాది?" అన్నాడు. 'అయితే పోయి శిలుం కొట్టుకో' అన్నాను. అటు సూసినాడు. ఇటు సూసినాడు. మొల్లోంచి తీశాడు. ఇచ్చు రూపాయి. బైరాగోళ్లు సెడ్డవోళ్లు. ఆళ్లకాడ దబ్బుంటాది. నువ్వేటిరా ఇచ్చినావు?"

"నాకాడేటుంది?"

"ఉన్నదే!"

"ఉంటే తగువేమి?"

"ఆ బియ్యమన్నీ వొగ్గేస్తావూ?"

"వొట్టికెళ్లు. మాట తిరిగితే వొట్టు."

ఆ రాత్రి చీకట్లో కుంటాడు ఎఱ్రిని పట్టుకొని చెడ్డ బతిమాలేడు. తనూ వాళ్లతో వుండిపోతాననీ, తనకీ గంజినీళ్లు పోస్తూ ఉండమనీ, తన్ని పెళ్లాడమనీ పెద్ద పట్టుపట్టేడు. ఎఱ్రి మెత్తబడ్డాది.

మర్నాడు ఎఱ్రి, సొట్టాడు కలిసి వొండుకుంటున్నారు. ఎఱ్రి చేపల పులుసు మళ్లా పెట్టింది. ఖైరేతీ సత్రవులో అందరి ముక్కులూ ఎగరగొట్టింది పులుసువాసన. జ్వరంతో పడుకున్న ముసిలాడు లేచాడు.

"ఈ దెవడు?" అనడిగాడు.

"ఇక్కడున్న సొట్టాడే! అన్నాది ఎఱ్రి.

"ఎందుకొచ్చినాడూ?"

"కలిసి వొందుకుంటున్నాం."

"కలిశా?"

"ఔను మామా, కలోసుకొన్నాం" అన్నాడు సొట్టాడు, ముసిలాడు ఎర్రగా చూశాడు.

"ఎళ్లవతలకి సెత్త ఎదవా!" అన్నాడు ముసిలాడు.

"ఎందుకలా కసురుతావు! నానంత సెడిపోయినోణ్ణి కాను" అన్నాడు సొట్టాడు!

"ఓరెరుగుదునెగ్రా, జాత్తక్కువ ఎదవా!"

సొట్టాడు పిచ్చెత్తిపోయాడు.

"నాకా జాత్తక్కువ? నాను కాపోళ్ల కుఱ్ఱోణ్ణి. ఏటనుకున్నావో! అఁ నీ కూతురు గొప్ప యిపోనేదు. జటకావోడితో పోయిన సెటకారీ, ఆ జటకావోడు జొన్న గుడ్డి మాలోడు!" అన్నాడు సొట్టాడు.

ముసిలాడు లేచి పులుసుదాక కాల్తో తన్నేడు. పెద్ద అల్లరి అయిపోయింది. ముష్టివాళ్లంతా మధ్య పడ్డారు. సొట్టాడు కుంటుకుంటూ వెళ్లిపోయాడు.

"ఈ వెదవా దొరికినాడు నీకు? సరియైనవోణ్ణి నానే సూత్తాను" అని ఎర్రికి చెప్పి ఎక్కడికో వెళ్లిపోయాడు. సొట్టాడు మళ్లీవొచ్చేడు.

"నా నేటిసేతును!" అన్నాది ఎర్రి.

"నువ్వు సెయ్యగలిగింది నువ్వు సెయ్యాల!"

"ఏటి సెయ్యమంటావు?"

"నాతోరా!"

"ఎక్కిడికి?"

"ఎక్కిడికేటి? రామేశ్వరం దరినుంచి అద్దుమాలిన రాజ్జం."

"ముసిలాడు?"

"ఆడేడుపాడేడుస్తాడు!"

"అంటే?"

"వొగ్గేద్దాం!"

"అమ్మ గుండెలీసినోడా! రోగిష్టివోణ్ణి వొగ్గేసి నీతో కులుకుతూ రమ్మంతావూ?"

"నీకిష్టమైతేనే!"

"ఎళ్లెళ్లు" అని కసరి కొట్టింది. ఎర్రి కెదురుగా గోడ మూల గోనె కప్పుకొని గొంగళీ పురుగులాగు చుట్టుకొని సొట్టాడు పడుకున్నాడు. ఎర్రి దాకలో అన్నం గంజి వేసి నంచుకోవడానికి నాలుగు మిరపకాయలు పెట్టి సొట్టాణ్ణి లేపింది.

"తిండి తిన్రా! మళ్లా మా యయ్యొస్తే జట్టీ."

"నాను తిన్ను!" అన్నాడు. ఎర్రి ఎంత బతిమాలినా లేచాడు కాదు.

ముసిలాడు వచ్చేడు. వాడితో పాటు గుడ్డివాణ్ణి ఒకణ్ణి తీసుకొచ్చాడు.

"ఎర్రీ!" అని కేకేశాడు. ఎర్రి పలికింది.

"ఇయాళ నుంచి నువ్వు ముగ్గురికి గంజినీళ్లు ఉడకెయ్యాలి. తెలిసిందా? ఆఁ? ఈ గుడ్డోణ్ణెరగవూ?"

ఎర్రి గుడ్డివాణ్ణి ఎరుగు, వాడితో వాళ్లు శ్రీకూర్మం డోలాయాత్ర కెళ్లారు.

"ఎర్రీ బాగున్నా"? అని కుశలమడిగేడు గుడ్డివాడు.

"ఏం బాగునే? ముసిలోడు మూలపడ్డాడు" అన్నాది ఎర్రి.

"పెద్దోడయ్యాడు" అన్నాడు గుడ్డివాడు.

"అనాగేనే" అన్నాది ఎర్రి.

"ఎర్రీ! ఇయాళ నుంచి నువ్వు ముగ్గురికి గంజినీళ్లు ఉడకెయ్యాలి."

అన్నాడు ముసిలాడు.

ఎర్రికి మతిపోయింది. పెంచి పెద్దదాన్ని చేసిన తండ్రి శుభ్రమైన కుంటాడు దేహీ అని కాళ్ల దగ్గరుంటే గుడ్డివాడికి కట్టి పెట్టడానికి పూనుకొన్నాడు. ఎర్రికి బోధపళ్లేదు. ఏమి లాభం? కాదండానికి వీల్లేదు. తండ్రి చెప్పినట్టు నడుచుకోక తీరదు. సత్రపు పంచమూలని కుక్కలాగ చుట్టుకొని కుంటాడు పడుకున్నాడు. తిండి తిన్నాడు కాదు. వాడు అడుక్కు తెచ్చిన బియ్యం పెట్టి ఎర్రి వంట చేసింది. ఎర్రి దిగాలుపడిపోయింది.

"ఎర్రీ! నవ్వు ఎర్రిదానివి. నిజంగా ఎర్రిదానివి" అన్నాడు ముసిలాడు. ఎర్రికి ఏడుపు వస్తున్నాది.

"ఇనారా ఎర్రీ!" అని ముసిలాడు దాన్ని దూరంగా తీసుకువెళ్లాడు.

"సూసినావా గుడ్డోణ్ణి?" అనడిగాడు. చూడకేం? ఎర్రికి అదివరకే తెలుసు. నల్లగా రాయిలాంటి వొళ్లు, నుదురు నిండా మెరిసిపోతూ నామం! పేలిన పత్తికాయల్లాగ కిందికి జారిపోతూ గుడ్లు! భయమేస్తూ గుడ్డివాడుంటాడు.

"ఆఁ సూసినాను" అని తొడలు వాయించుకొంది.

"నీకు సోట్టోడి మీదున్నాది!" అని వెక్కిరింపు నవ్వు నవ్వాడు.

"నా కెవిడి మీదా నేదు" అని శూన్యాన్ని చూసింది.

"అనాక్కాదు సెప్పు!"

"నాకు తెల్దు".

"నీకు సొట్టాడు కావాలి!"

"నీ యిష్టమే కానీ."

"అనాగన్నావు బాగుంది. అది నోకం మెచ్చినమాట. నాను సెప్పినాను ఇనుకో!" అన్నాడు ముసిలాడు. ఇనుకోక తప్పుతుందా! నిల్చో అంటే నిల్చోవాలి. వాడితో వెళ్లు అంటే వెళ్లాలి! మనసా ఇష్టంలేని పెళ్లికూడా వొద్దంటానికి అవకాశం లేదు. తిరుగుబాటు చేయడానికి సత్తువలేదు. చావడానికి సిద్ధంగా ఉన్న ముసిలి కుష్టురోగపు తండ్రిలో ఏమున్నాది! పెంచిన తల్లిదండ్రులకి ఆ అధికారం ఒక్కొక్క పిల్లపైని ఉన్నాది. ఉన్నాది ఒక్కొక్క పిల్లకి తల్లిదండ్రుల పైనా గౌరవం.

"ఇనుకోక కాదన్నానా?" అన్నాది ఎర్రి.

"ఆడికీ ఈడికీ తేడా సెప్పు?" అని అడిగాడు.

"సొట్టోడు సక్కగున్నాడు; గుడ్డోడు భయమేస్తున్నాడు."

"నాను భయమేస్తూ నేనూ? కుష్టురోగిని, నన్నెలాగసూస్తున్నావు. నాకెలాగ సేస్తున్నావు?"

"బాగుంది తండ్రివి!"

"నాను తండ్రినని ఇష్టపడ్డావా? ఆడు మొగుడని ఇష్టపడు! సేస్తూ ఓకాడ ఉంటే అదే ఇష్టమౌతుంది. సొట్టాడితో ఇంతకీ దినం ఎళుతుందా?"

"ఎందుకెళ్లదు?"

"మూడు పిడికెళ్ల ముష్టి దొరకదా?"

"అదిగక్కడే నాను సెపుతున్నాను. ఇనుకో!?" అని ముసిలాడు పెద్ద బోధచేశాడు. ముసిలాడి ఉపన్యాసం ముష్టిలోకానికి ఉపనిషత్తు.

"ఈ ముసిలాడు సచ్చే కాలానికి నన్నుద్దానం సేశాడని నువ్వేదవకు. సొట్టాడితో ఎల్లినావా. నీకు కూడునేదు. అలకించి యాదస్తుంచుకో! ఇవాళ సెప్పినది మళ్లీ పుస్కరానికి సూసుకో! సొట్టాడు ఏ గుమ్మమెక్కినా మొహం మీద భడీమని తలుపు ఏసుకుంటారు. ఆడి మొకంసూస్తే ముష్టి పలకదు. ఆడు నిన్నట్టుకు బతుకుతాడు. నిన్నాడికీ ఈడికీ కుదిరిసి ఆడు బతుకుతాడు. గుడ్డోడు మారాజు. కళ్లులేని కబోది. ఆడి జనమకదొక్కటే శాన. ఆణ్ణి సూస్తే జాలిపుడతాది. ఏయమ్మేనా మనసు కరిగి ఇన్ని గింజలేస్తాది.

అదంతా ఎందుకు? ఆడు అద్దుమాలిన పాటగోడు. ఆడి కెన్నెన్ని పదాలొచ్చును! ఆణ్ణి సెయ్యట్టుకుని తీసికెళ్లి నాలుగు రోడ్ల మధ్య నోవార కూకోయెట్టి, ఆడి ముందల గుడ్డ పరిసి నువ్వెళ్లిపో. ఆడు సితార పట్టుకుని, సిరతలు వోయిస్తూ పాడినాడంటే రూపాయి డబ్బులికి నాగారాదు. నీకదే దాకలా.

మనిసిని సూసినావా? గునపంనాగున్నాడు. నానాగ పెద్ద రోగం, మొండి సేతులూ నేవు. జిర్రనిసీదడు. ఇంత తెస్తాడు. ఇంత తింటాడు. నీ మీద ఆధారపడి నీ సెప్పు సేతల్లో ఉంటాడు. నువ్వెక్కిడికి యెల్లినా అడిగినోడుకాదు. నూడరాదు! నీకు మనుసయిందీ, ఇష్టమొచ్చినట్టు తిరుగు. తఖరనేదు. ఏటంటావు?" అనడిగాడు.

"నా నేటంటాను"? అన్నాది ఎర్రి.

"ఆనాక్కాదు. ఆణ్ణి వొగ్గకు. నాను బతికుండగా సెప్పుతున్నాను."

"సరేనే పద".

" ఈ బైరేగి సిటికి అందరికీ తెల్దు. నన్నడిగితే ముష్టిగుంటలంతా ఎతికి ఎతికి గుడ్డోళ్లనే కట్టుకోవాలి."

"పద." ఇద్దరూ సత్రపు అరుగు మీది కెళ్లారు.

"ఒరే గుడ్డీ! ఎర్రి వొప్పుకుంది. అదింకోమాటందు" అని ముసిలాడు చెప్పేడు. గుడ్డివాడు పొంగిపోయాడు. వాడి జన్మకి ఎర్రిలాంటి గుంట ఆజన్మాంతం దొరకడమే భాగ్యం.

"ఎర్రీ! ఇంద. ఇందునోవి తీసి రేపు కడేలూ, అందెలూ కొనుక్కో!" అని గుడ్డివాడు మొలగుడ్డల్లో పైకి కనబడకుండా దాచుకొన్న ముంతంత డబ్బుల మూట పైకి తీశాడు. కానులు, దమ్మిడీలు ఎన్నాళ్ల బట్టి కూడబెడుతున్నవో ముంతంత మూటని చేశాడు. అన్ని డబ్బులు ఏ ముష్టివాడి దగ్గరున్నాయి? ఎర్రి కళ్ళు చెదిరిపోయాయి.

"నాకు మెళ్ళోకి ఎర్రపూసలు కావాలి" అన్నాది. ఎర్రికి ఎర్రపూసలు ఎన్నాళ్లనుంచో మనసు.

"అయీ కొనుక్కో! కాని సిలవరు కడేలు, అందెలూ కొను. కడేలూ, గాజులూ నేకపోతే ఆడదానికి, మొగాడికీ ఏటి తేడా? కడేలు సెడ్డ అందం" అన్నాడు గుడ్డివాడు. కళ్లు లేని వాడికి కడియాల రవలూ, గాజుల మోతలే కాబోలు కామాన్ని కదుపుతాయి!

"ఇంక నెగండి. కూడుతిని తొంగుందాం" అన్నాడు ముసిలాడు. ఎర్రి ముగ్గురికి కూడు సర్దింది. మూకుడుతో కూడు పెట్టి గంజి నిండా పోసి గుడ్డివాడి కందించింది.

"మా యమ్మకదూ! అద్దిగలాగా ఆడికి దినం ఎళ్లనీ. నీ సేత్తో ఆడికింత ఎట్టు. ఇద్దరూ నా దినం సచ్చీదాకా ఎళ్లనీయండి. ఎర్రీ! నాను బతికుండగా సెపుతున్నాను. గుడ్డోణ్ణి వొగ్గకేం?" అన్నాడు ముసిలాడు.

❈

అరసం ప్రత్యేక సంచిక, సెప్టెంబరు – 1945